## కొనసాగుతున్న కూల్చివేతల పర్వం



సర్వే నంబర్ 42లో నిర్మాణాన్ని కూల్చివేస్తున్న జేసీబీ

సీసీసీ నస్పూర్, మే 20 : నస్పూర్ మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణాల కూల్చివేతల పర్వం పోలీసు బందోబస్తు నడుమ కొనసాగుతున్నది. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టవద్దంటూ ఇది వరకే హెచ్చరించినా.. కబ్జాదారుల్లో ఎలాంటి మార్పు కనిపించకపోవడంతో టాస్క్‌ఫోర్స్ టీం సీరియస్‌గా తీసుకున్నది. మున్సిపాలిటీలో ఉన్న ప్రభుత్వ భూములను కాపాడడం కోసం కూల్చివేతలు చేపడుతున్నది. సోమవారం మున్సిపల్ పరిధిలోని 10, 11వ వార్డులో గల ప్రభుత్వ భూమిలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను అధికారులు కూల్చివేశారు. విలేజ్‌నస్పూర్‌కు వెళ్లే ప్రధాన రహదారి, సర్వే నంబర్ 42లో నిర్మిస్తున్న ఇంటి పిల్లర్లు, ఫ్లడ్‌కాలనీ సమీపంలోని సర్వే నంబర్ 64లో మరో ఇంటి నిర్మాణాన్ని కూల్చివేశారు. నస్పూర్–మంచిర్యాల ప్రధాన రోడ్డు పక్కన సర్వే నంబర్ 102లో నిర్మిస్తున్న కమర్షియల్ కాంప్లెక్స్ పిల్లర్లను తొలగించారు. టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు, నస్పూర్ తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్ ఉన్నారు.

## తెరుచుకున్న లైబ్రరీ

● 'నమస్తే' కథనానికి స్పందన




తెరుచుకున్న తాళ్ల పేట గ్రంథాలయం

దండేపల్లి, మే 20 : మండలంలోని తాళ్లపేట గ్రామంలో ప్రధాన రహదారి పక్కన గతేడాది గ్రంథాలయం ప్రారంభించారు. ఆపై నిరుపయోగంగా మారగా, సోమవారం 'తెరుచుకోని లైబ్రరీ' శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. ఇందుకు స్థానిక జీపీ అధికారులు, సిబ్బంది స్పందించారు. లైబ్రరీని శుభ్రం చేయించి అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇక నుంచి లైబ్రరీ ప్రతిరోజూ తెరిచే ఉంటుందని, విద్యార్థులు, ఉద్యోగార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జీపీ కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. లైబ్రరీ తెరిచేందుకు కృషి చేసిన 'నమస్తే తెలంగాణ'కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.



మంచిర్యాలలో రాళ్ల వాగు నాలా స్థలాన్ని చదును చేసిన కబ్జాదారులు, కిందపడిన పట్టణ ప్రకృతివనం బోర్డు

## ప్రభుత్వ భూమి ఆక్రమణకు యత్నం

- అడ్డుకున్న మున్సిపల్ అధికారులు
- రెండు బ్లేడ్ ట్రాక్టర్లు సీజ్



ఆక్రమణ కోసం చదును చేసిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మంచిర్యాలటౌన్, మే 20 : మంచిర్యాల పట్టణంలోని రాళ్లవాగు నాలా శిఖం సర్వేనంబర్ 140లోని రెండెకరాలను ఆక్రమించుకునేందుకు కొందరు ప్రయత్నించారు. ఏకంగా ప్రభుత్వ స్థలంలో నాటిన చెట్లను తొలగించి బ్లేడ్ ట్రాక్టర్లతో చదును చేయించారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు ఆ ప్రభుత్వ భూమిని చదును చేస్తున్న రెండు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకొని సీజ్ చేశారు. ఈ స్థలంలో ఎవరు చదును చేయమన్నారని అధికారులు అడిగిన ప్రశ్నలకు ట్రాక్టర్ డ్రైవర్లు సమాధానం ఇవ్వకుండా పారిపోయారు. మంచిర్యాల పట్టణంలోని ఆర్ఆర్ నగర్ శివారులోని రెండెకరాల రాళ్లవాగు నాలా శిఖం భూమిని చాలా ఏళ్లుగా పలువురు కబ్జాచేయాలని యత్నిస్తున్నారు. పలుమార్లు కబ్జారాయళ్లు చేసిన ప్రయత్నాలను అధికారులు తిప్పికొట్టారు. నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో ఉన్న ఈ భూమిని తరచూ కబ్జా చేసేందుకు యత్నిస్తుండగా, రెండేళ్ల క్రితం చెట్ల పెంపకం కోసమని మున్సిపాలిటీకి అప్పగించారు. ఈ రెండెకరాల్లో పట్టణ ప్రకృతివనం పేరుతో మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు. తాజాగా.. ఆదివారం సెలవు దినాన్ని ఆసరాగా చేసుకున్న కొందరు కబ్జారాయుళ్లు అక్కడున్న చెట్లను తొలగించి, బ్లేడ్ ట్రాక్టర్ల సాయంతో చదును చేయించారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అజీజ్ తమ సిబ్బందితో కలిసివెళ్లి అక్కడ నడుస్తున్న ట్రాక్టర్లను తహసీల్ కార్యాలయానికి తరలించి సీజ్‌చేశారు. సోమవారం సాయంత్రం వరకు ట్రాక్టర్లకోసం సంబంధిత యజమానులెవ్వరూ కార్యాలయానికి రాలేదు. కాగా, పట్టణానికి చెందిన ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారి, ఒక మున్సిపల్ కౌన్సిలర్ కలిసి ఈ భూమి ఆక్రమణకు యత్నించినట్లు పట్టణంలో ప్రచారం జరుగుతుంది. కాగా, సోమవారం ఆ స్థలాన్ని మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్, తహసీల్దార్ రమేశ్, ఆర్ఐ అజీజ్, సిబ్బంది పరిశీలించారు. ప్రభుత్వ స్థలాన్ని కాపాడేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఉన్నతాధికారులకు తెలియపరుస్తామని వారు తెలిపారు.

## దహెగాం పీఏసీఎస్‌లో పందికొక్కులు

- రూ. 50 లక్షలు పక్కదారి
- ఇప్పటికే రూ. 10 లక్షలు రికవరీ
- మిగతా వాటి కోసం నోటీసులు జారీ చేసిన డీసీవో
- కార్యాలయం నుంచి తీర్మాన పత్రాలు సైతం మాయం చేసిన ఘనులు

కుమ్రం భీం ఆసిఫాబాద్(నమస్తే తెలంగాణ)/ దహెగాం, మే 20 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని దహెగాం పూర్వ ప్రాథమిక సహకార సంఘం (పీఏసీఎస్)లో రూ. 50 లక్షలు పక్కదారి పట్టిన విషయం ఇటీవల వెలుగులోకి వచ్చింది. సంఘం సభ్యులు పందికొక్కుల్లా నిధులు కాజేసినట్లు ఆరోపణలు రాగా, విచారణ చేపట్టిన జిల్లా సహకార సంఘం అధికారి రూ. 10 లక్షలు రికవరీ చేయడంతో పాటు మిగతా వాటి కోసం శనివారం నోటీసులు జారీ చేశారు.



దహెగాంలోని పీఏసీఎస్ కార్యాలయం

### రూ. 50 లక్షలు స్వాహా... రికవరీ రూ. 10 లక్షలు

దహెగాం ప్రాథమిక సహకార సంఘం ద్వారా యేటా సుమారు 11 వేల మంది రైతులకు ప్రభుత్వం ఎరువులు సరఫరా చేస్తున్నది. సుమారు 34 వేల ఎకరాలకు ఈ సొసైటీ నుంచే ఎరువులు అందిస్తున్నారు. యేటా సీజన్‌లో సుమారు 300 టన్నుల ఎరువులు ఈ సొసైటీకి వస్తుండగా, రైతులకు సబ్సిడీపై విక్రయించి.. వచ్చే సొమ్మును సొసైటీలో జమ చేస్తుంటారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. 2020–21 నుంచి 2022–23 వరకు జరిగిన విక్రయాల్లో పెద్ద మొత్తంలో అవినీతి జరిగినట్లు తెలిసింది. రైతులకు విక్రయించిన సబ్సిడీ ఎరువులకు సంబంధించిన నిధులను సొసైటీలో సక్రమంగా జమ చేయకుండా దుర్వినియోగపరిచినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో అధికారులు కొన్ని రోజుల క్రితం అంతర్గతంగా విచారణ చేపట్టారు. ఎరువుల విక్రయాల ద్వారా వచ్చిన మొత్తం రూ. 50 లక్షలను సొసైటీలో జమచేయకుండా వాడుకున్నట్లు గుర్తించి నోటీసులు ఇచ్చారు. దీంతో రూ. 10 లక్షలను సభ్యుల నుంచి రికవరీ చేశారు. ఇంకా రూ. 40 లక్షలు రికవరీ కావాల్సి ఉంది. దాదాపు ఏడాది గడుస్తున్నా నిధులు రికవరీ కాకపోవడంతో జిల్లా సహకార సంఘం అధికారి శనివారం మరోసారి నోటీసులు జారీ చేశారు. నిధుల దుర్వినియోగంలో ఎవరెవరి పాత్ర ఉంది, దుర్వినియోగం అయిన నిధులను ఎలా రికవరీ చేయాలనే దానిపై అధికారులు చర్యలు ప్రారంభించారు.

### సంఘం సభ్యుల్లో దడ..

దహెగాం సొసైటీలో నిధుల దుర్వినియోగం వెలుగులోకి రావడంతో సభ్యుల్లో దడమొదలైంది. సొసైటీలో మొత్తం రూ. 50 లక్షలు దుర్వినియోగం కాగా, గతంలో రూ. 10 లక్షలు రికవరీ అయ్యాయి. మిగతా రూ. 40 లక్షల్లో ఎవరు ఎన్ని డబ్బులు తిన్నారు, ఎవరెవరు ఎంత రికవరీ చేయాలనే దానిపై సహకార సంఘం సభ్యులు, అధికారులు చర్చించినట్లు తెలసింది. ఎవరు ఎంత కట్టాలన్న దానిపై తీర్మానాలు కూడా చేసుకున్నట్లు సమాచారం. ఇక ఇదిలా ఉంటే దుర్వినియోగమైన నిధులు ఎవరెన్ని వాడుకున్నారు, ఎవరి నుంచి ఎంతెంతీ రికవరీ చేయాలన్న అంశంపై తీర్మానాలు చేసిన పత్రాలు కూడా సొసైటీ కార్యాలయం నుంచి మాయమైనట్లు తెలిసింది.

### నోటీసులు జారీ చేశాం : మోహన్, డీసీవో

దహెగాం పీఏసీఎస్‌లో జరిగిన నిధుల దుర్వినియోగం గురించి సొసైటీకి నోటీసులు జారీ చేశాం. మొత్తం రూ. 50 లక్షలు దుర్వినియోగం అయ్యాయి. ఇందులో రూ. 10 లక్షలు రికవరీ చేశాం. ఇంకా రూ. 40 లక్షలు రికవరీ కావాల్సి ఉంది. ఈ సంఘం ద్వారా రైతులకు సబ్సిడీ ద్వారా ఎరువులను విక్రయించాలి. వచ్చిన డబ్బులను సొసైటీలో జమచేయాలి. ఎరువులు అమ్మగా వచ్చిన మార్జిన్ డబ్బులను వేతనాలుగా, ఇతర ఖర్చులకు వినియోగించుకోవాలి. కానీ, ఈ సొసైటీలో ఎరువులు విక్రయించగా వచ్చిన డబ్బులను నేరుగా వాడుకున్నారు. ఈ నిధుల రికవరీ కోసం శనివారం నోటీసులు జారీ చేశాం.



బీఆర్ఎస్ కార్యకర్తలను పరామర్శిస్తున్న బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రమేశ్

## కార్యకర్తలను కాపాడుకుంటాం

- పార్టీ నియోజవర్గ ఇన్‌చార్జి రమేశ్
- కాంగ్రెస్ నేతల దాడిలో గాయపడ్డ బీఆర్ఎస్ కార్యకర్తలకు పరామర్శ

చెన్నూర్, మే 20 : తమ పార్టీ కార్యకర్తలను కడుపులో పెట్టుకొని కాపాడుకుంటామని బీఆర్ఎస్ చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజా రమేశ్ పేర్కొన్నారు. ఇటీవల కాంగ్రెస్ నేతల దాడిలో గాయపడ్డ సుద్దాలకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త రాజబాపు, కాచన్‌పల్లికి చెందిన కార్యకర్త కందుగుల విజయ్ మంచిర్యాల ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతుండగా, సోమవారం ఆయన పరామర్శించారు. ధైర్యం చెప్పి, వైద్యం కోసం ఆర్థిక సాయమందించారు. కాంగ్రెస్ నేతలు రాజబాబు, విజయ్ కుటుంబ సభ్యులపైనా దాడి చేయడం దారుణమని ఖండించారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ ఎంపీపీ మంత్రి బాపు, జడ్పీటీసీ మోతె తిరుపతి, బీఆర్ఎస్ నాయకులు రవి, ప్రభాకర్, హరీశ్, శివ, సాయి పాల్గొన్నారు.

## గ్రూప్-1 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ టౌన్, మే 20 : జూన్ 9న గ్రూప్–1 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో టీఎస్‌పీఎస్సీ చైర్మన్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ, ఎస్పీ సురేశ్‌కుమార్ తో కలిసి జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రూప్–1 పరీక్షల నిర్వహణ కోసం జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)ను నోడల్ అధికారిగా నియమించడం జరిగిందని, సంబంధిత అధికారులను సమన్వయం చేసుకుంటూ ఎలాంటి పొరపాట్లు లేకుండా పరీక్షలు నిర్వహించాలన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేశామని, ప్రశ్నాపత్రాలను పోలీసు బందోబస్తు నడుమ కేంద్రాలకు తరలించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో 13 కేంద్రాలను ఏర్పాటు చేశామని, నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేసి పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. బయోమెట్రిక్ విధానం ద్వారా ఎలాంటి ఇబ్బందుల్లే పరీక్షల నిర్వహణ జరుగుతుందని, ఈ క్రమంలో సంబంధిత అధికారులకు 22న శిక్షణ ఇస్తామని తెలిపారు.

### రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలి

రోడ్డు భద్రతా నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఎస్పీ సురేశ్ కుమార్‌తో కలిసి జిల్లా రవాణా శాఖ, పంచాయతీరాజ్, రోడ్లు–భవనాలు, మున్సిపల్, ఇంజినీరింగ్ శాఖల అధికారులతో రోడ్డు ప్రమాదాల నివారణ, రోడ్డు భద్రత చర్యల అమలుపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ బ్లాక్ స్పాట్ జాబితాలో ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక నిఘా పెట్టి ప్రమాదాలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని, వాహనదారులంతా రోడ్డు భద్రత నియమాలు పాటించేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. స్పీడ్ బ్రేకర్లు, మూల మలుపులు, ప్రమాద ప్రాంతాలు తెలిసేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు రోడ్లు అనుసంధాన ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలించకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

### ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలకు కట్టుదిట్టమైన భద్రత

డీ–కేటగిరి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు, ఆసిఫాబాద్ తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్ పాండే, ఎన్నికల పర్యవేక్షకుడు మధుకర్, డిప్యూటీ తహసీల్దార్ జితేందర్, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా వేర్ హౌస్ నుంచి వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాములకు ఈవీఎంలను తరలించి భద్రపరిచారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే



అధికారులకు సూచనలు ఇస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

## పాఠశాలల మరమ్మతులు పూర్తవ్వాలి

జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

ఆసిఫాబాద్ టౌన్,మే 20 : 2024–25 విద్యా సంవత్సరంలో పాఠశాలలు పునఃప్రారంభమయ్యేలోగా అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న మరమ్మతులు పూర్తవ్వాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సురేందర్, జిల్లా గిరిజనాభివృద్ధి శాఖ అధికారి రమాదేవి, జిల్లా పంచాయతీ శాఖ అధికారి భిక్షపతిగౌడ్‌తో కలిసి వివిధశాఖల అధికారులు, ప్రధానోపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. పాఠశాలల అభివృద్ధి, ఏకరూప దుస్తులపై చర్చించారు. జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నారని, తాగునీరు, మూత్రశాలలు, విద్యుద్దీకరణ పనులతో పాటు తరగతి గదుల మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల ప్రారంభం రోజునే విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించేందుకు జిల్లా వ్యాప్తంగా 78 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

## సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

నస్పూర్, మే 20 : ఈ నెల 24వ తేదీ నుంచి నిర్వహించనున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. సోమవారం నస్పూర్‌లోని కలెక్టర్‌లో జిల్లా ఇంటర్ అధికారులు, పోలీసులు, పంచాయతీ, రెవెన్యూ, రవాణా, మున్సిపల్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 24 నుంచి జూన్ ఒకటో తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారని, ఇందుకోసం జిల్లాలో 16 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రథమ సంవత్సరం పరీక్షలకు 4510 మంది జనరల్, 402 మంది ఒకేషనల్, ద్వితీయ సంవత్సరంలో 2005 మంది జనరల్, 383 మంది ఒకేషనల్ విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. జూన్ 3 నుంచి 13వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, ఇందుకోసం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలురు, బాలికల పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 704 మంది విద్యార్థులు హాజరు కానున్నారని, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల సీఐ అశోక్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శైలజ, డీపీవో వెంకటేశ్వర్‌రావు, మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్, ఆరోగ్య శాఖ మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

## అక్షరాస్యత కార్యక్రమం నిరంతరం

ప్రొఫెసర్, ఎస్ఐఈటీ రాష్ట్ర ఇన్‌చార్జి అధికారి డాక్టర్ రవికాంత్‌రావు



మాట్లాడుతున్న ప్రొఫెసర్, ఎస్ఐఈటీ రాష్ట్ర ఇన్‌చార్జి అధికారి డాక్టర్ రవికాంత్‌రావు

కన్నెపల్లి, మే 20 : అక్షరాస్యత కార్యక్రమం నిరంతరం కొనసాగేలా ప్రభుత్వం నూతన న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాం ప్రవేశపెట్టిందని ప్రొఫెసర్, ఎస్ఐఈటీ రాష్ట్ర ఇన్‌చార్జి అధికారి డాక్టర్ రవికాంత్‌రావు అన్నారు. కన్నెపల్లి మండల కేంద్రంలో వయోజన విద్యాశాఖ, సఖీ, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేపడుతున్న అక్షరాస్యత, కుట్టు శిక్షణ కేంద్రాలను సోమవారం ఆయన సందర్శించారు. కొన్నేండ్లుగా రాష్ట్రంలో అక్షరాస్యత కార్యక్రమాలు అధికారికంగా ముగిసినప్పటికీ మంచిర్యాల జిల్లాలో వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ కేంద్రాల్లో అక్షరాస్యత కార్యక్రమం కొనసాగుతున్నది, ఇందుకు కృషి చేస్తున్న జిల్లా వయోజన విద్యాశాఖ అధికారి పురుషోత్తం నాయక్‌ను అభినందిస్తున్నట్లు తెలిపారు. మహిళలు, 8,9, 10 తరగతుల విద్యార్థులు కూడా నిరక్షరాస్యత నిర్మూలన కార్యక్రమంలో పాల్గొని, వంద శాతం అక్షరాస్యత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, లీడ్ బ్యాంక్ మేనేజర్ తిరుపతి, జిల్లా విద్యాశాఖ సెక్టోరల్ అధికారి సత్యనారాయణమూర్తి, కన్నెపల్లి బ్యాంక్ అధికారి గురుమూర్తి, సఖీ లైన్స్ క్లబ్ అధ్యక్షురాలు బండ శాంకరి, డీఆర్పీలు సువర్ణ, ప్రకాశం, వెంకటేశ్వర్లు, మహిళలు పాల్గొన్నారు.

### మందమర్రిలో..

మందమర్రి, మే 20 : మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని శ్రీపతినగర్ కాలనీలో వయోజన విద్యా శాఖ, లయన్స్ క్లబ్ మంచిర్యాల సఖీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని రవికాంత్ రావు సందర్శించారు. వయోజన విద్యా కేంద్రం అభ్యాసకులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కుట్టు శిక్షణ తీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంచుకున్న రంగాల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఆర్థికంగా ఎదిగినప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వో ఎస్ఎన్ మూర్తి, డీఆర్పీలు సుందిళ్ల రమేశ్, శిక్షణ కేంద్రం కో–ఆర్డినేటర్ ఉప్పులేటి గోపిక, కన్వీనర్ ఉప్పులేటి నరేశ్, ట్రైనర్ శారద పాల్గొన్నారు.

## 23న స్పాట్ కౌన్సెలింగ్

ఆసిఫాబాద్ టౌన్, మే 20 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికిగాను జిల్లాలోని గిరిజన గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ఖాళీల భర్తీకి స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఆసిఫాబాద్ గిరిజన గురుకుల కళాశాల(బాలికల) ప్రిన్సిపాల్ అనిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఈ నెల 23న ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న స్పాట్ కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం కోరారు.

## దరఖాస్తుల స్వీకరణ

ఆసిఫాబాద్ టౌన్, మే 20 : 2024–25 విద్యా సంవత్సరానికి బెస్ట్ అవైలేబుల్ పాఠశాలల పథకం కింద రెసిడెన్షియల్, నాన్ –రెసిడెన్షియల్ ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి సంజీవన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బెస్ట్ అవైలేబుల్ పాఠశాలల పథకంలో జిల్లాకు 78 సీట్లు కేటాయించగా, 1వ తరగతి (నాన్ –రెసిడెన్షియల్)లో 38, 5వ తరగతి (రెసిడెన్షియల్)లో 40 సీట్లు కేటాయించామని పేర్కొన్నారు. జూన్ 7వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని తెలిపారు. 1వ తరగతిలో ప్రవేశం కోసం విద్యార్థులు జూన్ 1, 2018 నుంచి 31 మే, 2019 మధ్య జన్మించి ఉండాలని తెలిపారు.